క్లుప్తంగా

14 మద్యం షాపులు మంజూరు

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో 14 మద్యం షాపులు మంజూరైనట్లు ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పత్తికొండ మండలానికి 5, తుగ్గలి 2, మద్దికెర 1, దేవనకొండ 3, గోనెగొండ్ల మండలానికి 3 దుకాణాల చొప్పున మొత్తం 14 దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలని, ఈ మొత్తం తిరిగి ఇవ్వబడదన్నారు. వీటిని ప్రైవేటుగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు పత్తికొండ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తుగ్గలి : మండలంలో రాంపల్లిలో ఏఈఓ లక్ష్మీచైతన్య, శభాష్‌పురంలో వీఏఏ మహేష్ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన గీతావాణి


ట్రాన్స్‌కో ఏఈగా ఆంజనేయ శాస్త్రి


వరలక్ష్మి


ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన సీవీ కొండయ్య

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా గీతావాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాణెమ్మ బెళగల్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో ఆదోనిలో ఎంపీడీఓగా పనిచేస్తున్న గీతావాణిని ఆస్పరికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఆస్పరి ట్రాన్స్‌కో ఏఈగా ఆంజనేయశాస్త్రి విధుల్లో చేరారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న మల్లికార్జున ఆదోనికి, కర్నూలు రూరల్ సెక్షన్‌లో ఏఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆంజనేయ శాస్త్రిని ఇక్కడికి బదిలీ చేశారు

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరణ

మద్దికెర : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీ.వీ కొండయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నరసింహమూర్తి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సీవీ కొండయ్యను నియమించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

హాలహర్వి ఎంపీడీఓగా వరలక్ష్మి

హాలహర్వి: ఎంపీడీవోగా వరలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అంతకు ముందు ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రమౌళేశ్వర గౌడ్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

సర్వే డీఐవోఎస్ బాధ్యతల స్వీకరణ

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐవోఎస్) జి. దేవేంద్రయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వైఎస్సార్ కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

మద్దికెర : రబీ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేయి శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని బురుజుల, పత్తికొండ మండలం హోసూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీని ప్రారంభించారు. మండలానికి 3,890 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు. తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ జెడ్పీటీసీలు పురుషోత్తం చౌదరి, రాజన్న, ఏఓ రవి, నాయకులు మోహన్, ఎర్రిస్వామి, సందీప్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

హొళగుంద: గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన పెద్దహ్యాట రోడ్డును గురువారం సర్పంచ్ హుసేన్ , పంచాయతీ సెక్రటరీ రాజకుమార్ మరమ్మతులు చేయించారు. పెద్దహ్యాట నుంచి ఎల్లార్తి రోడ్డు క్రాస్ వరకు అధ్వానంగా మారడంతో సర్పంచ్ పంచాయతీ నిధులతో గ్రావెల్ వేయించి గుంతలు పూడ్చించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

కృష్ణగిరి: మండలంలోని ఆలంకొండ గ్రామంలో అక్రమంగా నాటుసారా అమ్ముతున్న బోయ కాశీనాథ్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. నిందితుడి నుంచి ఏడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల సంత!

- ఆదాయం పుష్కలంగా ఉన్నా.. వేధిస్తున్న సౌకర్యాల కొరత
- వారపు సంతలో షెడ్లు లేక ఎండిపోతున్న ఆకుకూరలు.. తడిసిపోతున్న వ్యాపారులు
- మరుగుదొడ్లు, తాగునీరు లేక ప్రజల అవస్థలు

వారపు సంత	ఈ ఏడాది వేలంలో లభించిన ధర
హొళగుంద	రూ. 1.38లక్షలు
ఆలూరు	రూ. 2.11లక్షలు
దేవనకొండ	రూ.1.50 లక్షలు
ఆస్పరి	రూ. 28 వేలు

హొళగుంద: పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరు వారపు సంత మార్కెట్. వాటి నుంచి ఆదాయం లభిస్తున్నా సంతల్లో కనీస వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు, వానకు ఆకుకూరలు, కూరగాయాలు చెడిపోతున్నాయి. వీటి నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తుంది. అయితే సంతలో కనీస వసతులు కల్పించడంతో పంచాయతీ అధికారులు విఫలమవడంతో కొనుగోలుదారులు, రైతులు, వ్యాపారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ప్రతి సోమవారం సంత..

మండల కేంద్రం హొళగుందలో ప్రతి సోమవారం వారపు సంత నిర్వహిస్తారు. ఇందుకు మండలంలోని 12 గ్రామాల ప్రజలతో పాటు సమీపంలోని కర్ణాటకకు చెందిన మాటసుగూరు, ఉత్తనూరు, కెబెళగల్ తదితర గ్రామల ప్రజలు, దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వస్తారు. ఇక్కడ క్రయవిక్రయాలు నేలపైనే జరుగుతాయి. షెడ్లు లేకపోవడంతో నేలపైన, లేదా రోడ్లపై అమ్మకాలు చేస్తారు. ఇక మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేక వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా.. రుసుము మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

దేవనకొండ మండలంలో..

దేవనకొండలో బుధవారం, తెర్నేకల్ శుక్రవారం వారపు సంత జరుగుతుంది. వ్యాపార్లులకు స్థలం లేక రోడ్డు పక్కన, మురుగు కాల్వలు, మురుగు గుంతల పక్కన అమ్మకాలు జరుగుతున్నాయి. వర్షం వస్తే సంత నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ కూడా వ్యాపారులకు షెడ్లు లేవు. వ్యాపారులు పట్టాల, కవర్లను గుడారాలు కట్టుకుని నీడ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్నారు.

☛ ఆలూరులో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. ఇక్కడ కాయగూరలతో పాటు ఎద్దుల అమ్మకాలు కూడా జరుగుతాయి. అయితే వచ్చిన వారికి కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేలపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇక పందులు, కుక్కలు బెడద తీవ్రంగా ఉంటోంది. వర్షం వచ్చిందంటే సంత ప్రాంతాలు బురదమయంగా మారతాయి. వాటిలో అమ్మకాలు చేపడుతున్నారు.

☛ ఆస్పరిలో గురువారం సంత జరుగుతుంది. ఇక్కడా వసతులు లేవు. తగిన స్థలం లేక రోడ్డుకిరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మలమూత్ర విసర్జన చేస్తుండడంతో రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు దుర్గంధం తట్టుకోలేకపోతున్నారు.

☛ ఇవి కాకుండాజాతరలు, ఉత్సవాలు ఇతర కార్యక్రమాలు జరిగితే అదనపు ఆదాయం సమకూరుతుంది. కానీ ఈ నిధులను మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో తాజాగ వచ్చిన సరుకులు ఎండకు, దుర్గంధానికి చెడిపోవడం, ఇతర ప్రభావలకు గురవుతున్నాయి. ఫలితంగా నష్టం చవిచూడాల్సి వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.


హొళగుంద వారపు సంత మార్కెట్‌లో గోనె సంచులను కట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న దృశ్యం



బురదలో వారపు సంత, ఎండలో గొడుగు పట్టుకుని సరుకులు అమ్ముకుంటున్న మహిళలు

ఆకుకూరలు వాడిపోతున్నాయి



ముందు రోజు సాయంత్రం ఆకుకూరలు పొలంలో కోసి తీసుకొని తెల్లవారుజామున సంతకు తీసుకొస్తే వాటికి సరైన రక్షణ లేదు. దీంతో వాడిపోతున్నాయి. పక్కనే మురుగు దుర్గంధం వెదజల్లుతుంది. పందులు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. కట్టలు నిర్మించి షెడ్లు వేస్తే సౌకర్యావంతంగా ఉంటుంది. ఇక సంతకు వచ్చే వారికి కనీస వసతులు లేవు. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– రహంతుల్లా, వ్యాపారి

వసతులు లేవు



సంతలో వసతులు లేవు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సంత ప్రదేశం చాలడం లేదు. రోడ్డుపై, జనాలు తిరిగే ప్రదేశాల్లో దుకాణాలు వేసుకుంటున్నారు. వర్షం వచ్చిందంటే అంతే. కూరగాయలు నీళ్లలో కొట్టుకుపోతాయి. ఏ కాలంలోనైనా సంత జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ముందుగా తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు ఏర్పాటు చేయాలి.

– షరీఫ్, వ్యాపారి

అత్యవసర సమయాల్లో ఇబ్బందులుపడుతున్నాం



సంత మార్కెట్‌లో కాయగూరలు కొనేందుకు వెళ్లే మహిళలు అత్యవసరమైతే వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ఇరుకుగా ఉండడం, బాత్ రూం వెళ్లాల్సి వస్తే, తాగునీటి సమస్య ఇలా ఇబ్బందులు అనేకం. ఇక పల్లెల నుంచి కాయగూరలు అమ్ముకోవడానికి వచ్చే వారి అవస్థలు వర్ణనాతీతం. అధికారులు మహిళలను దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి.

– మారెమ్మ, హొళగుంద

దేవరగట్టు ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి


బన్ని ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య కోరారు. గురువారం పత్తికొండలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ తిమ్మ య్య, మల్లికార్జున, రాజశేఖర్‌గౌడ్, సదాశివ, మల్లయ్యగౌడ్, కొత్తపేట మల్లయ్య, దాక్యనాయక్ తదితరులతో కలిసి ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన రాత్రి జరిగే బన్ని ఉత్సవాన్ని ప్రతి ఒక్కరూ సంప్రదాయ పద్ధతిలో జరిగేందుకు కృషి చేయాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


విశ్వమోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఎంపీడీఓగా పనిచేస్తూ తుగ్గలి మండలానికి బదిలీపై వెళ్తున్న విశ్వమోహన్‌ను గురువారం సన్మానించారు. స్థానిక కార్యాలయంలో ఎంఈఓ సనంద, ఎమ్మార్వీ కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధరణమని పని చేసిన చోట చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈఓ అన్నారు. ఇక్కడకు నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఎంపీడీఓగా పనిచేస్తున్న మోహన్‌కుమార్‌ను నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ


చిన్నహ్యాటలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న రైతు


మాట్లాడున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ

- పాల్గొన్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ
- పలు సమస్యలను లేవనెత్తిన చిన్నహ్యాట వాసులు

హొళగుంద: చిన్నహ్యాట గ్రామ సమీపంలోని 194 సర్వే నంబరులోని 3.70 హెక్టార్లలో క్వారీ ఏర్పాటుకు గురువారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ, పర్యావరణ శాఖ ఇంజినీర్ కిశోర్‌రెడ్డి, తహసీల్దారు ప్రసాద్‌రాజు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఇక్కడ క్వారీ ఏర్పాటు వల్ల తలెత్తే సమస్యలు, అభ్యంతరాలను గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్వారీ నుంచి తీసే రాయిని గ్లాసు, ల్యాప్ ట్యాప్ తదితర వస్తువుల తయారీలో ఉపయోగిస్తారన్నారు. ఇప్పటికే 14.64 హెక్టార్లలో క్వారీలు నడుస్తుండగా కొత్తగా మరో క్వారీని నడపడానికి మెస్సర్ శశి మైనింగ్ సొల్యూషన్ కంపెనీ 3.70 హెక్టార్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇక్కడ క్వారీ ఏర్పాటైతే పర్యావరణానికి నష్టాలు, గ్రామంలో తలెత్తే ఇతర అంశాలను చెప్పాలని కోరారు. దీంతో గ్రామస్తులు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. ప్రస్తుతం క్వారీలు నడుపుతున్న వ్యక్తి తమ పొలాలకు సంబంధించి ఏడాదికి రూ.10 వేలు చొప్పున పరిహారం ఇస్తానని చెప్పి ఇవ్వటం లేదని రైతు చెన్న బసవ ఆరోపించారు. ఇలా మరి కొందరు రైతులు ఉన్నామని వారికి అగ్రిమెంట్ ప్రకారం ఇవ్వడం లేదన్నారు. పేలుళ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని దుమ్ము, ధూళి లేవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వారీ ముందుగా వెళ్తున్న రోడ్డును బాగు చేయించాలని, గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు సహకారించాలని కోరారు. కాగా.. గ్రామ సభలో ఊరి బయట పెట్టడం, గ్రామస్తులు అంతగా పాల్గొనకపోయారు. ఎన్‌జీఓలే ఎక్కువ మంది ఉండటం విశేషం. కార్యక్రమానికి ముందు ఆయన పాత క్వారీలతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న క్వారీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ హుసేన్‌బాషా, ఎంపీటీసీ శివన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్ర

హాలహర్వి: హాలహర్వి–ఆలూరు రోడ్డులో గురువారం కారు–బైకు ఢీకొన్న ఘటనలో బాపురం గ్రామానికి చెందిన ఉమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు ఉమేష్‌ను హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ చంద్ర ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉమేష్ తన కుమార్తె అనారోగ్యానికి గురి కావడంతో గురువారం మోటార్ సైకిల్‌పై వెళ్లి ఆలూరులో చికిత్స చేయించి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గ మధ్యలో హాలహర్వి సమీపంలో ఓ కారు బళ్లారి నుంచి ఆదోనికి వెళ్తుండగా ఆవులు అడ్డంగా రావడంతో డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు బోల్తా పడింది. అదే సమయంలో మోటార్ సైకిల్‌పై కుమార్తెతో కలిసి వస్తున్న ఉమేష్ కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఉమేష్ తలకు గాయాలు కాగా, ఉమేష్ కుమార్తెకు, కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని సూపరింటెండెంట్ రామస్వామి తెలిపారు. మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఒక్కరు మాత్రమే రావడంతో వాయిదా వేసి శుక్రవారం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం


సర్వేయర్ గాదిలింగప్పను సన్మానిస్తున్న తహసీల్దార్

తుగ్గలి : సాధారణ బదిలీల్లో భాగంగా మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న గాదిలింగప్ప పత్తికొండ మండలానికి బదిలీ అయ్యారు. దీంతో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గాదిలింగప్పను తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్లు ఘనంగా సన్మానించారు. వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

దేవనకొండ: మండలంలోని గద్దెరాళ్ల స్టేజీ వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గాయపడిన వ్యక్తి చేతిపై దుర్గమ్మ, జ్యోతి అనే పేర్లు ఉన్నాయి. దేవనకొండ పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

అమ్మకు తొలి పూజ

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


తుగ్గలిలో బాలాత్రిపురసుందరిగా


ఆస్పరిలో బాలా త్రిపుర సుందరి


మద్దికెరలో బాలా త్రిపురసుందరి

పత్తికొండ(తుగ్గలి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పత్తికొండలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుగ్గలిలో..

తుగ్గలిలో దుర్గామాత విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. మొదటి రోజు బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు రామాంజి, బ్రహ్మయ్య, మోహన్, సూరి, శ్రీకాంత్, సమీర్ పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రుల పూజలు

ఆస్పరి: స్థానిక కన్యకా పరమేశ్వరి, రామతీర్థంలోని పార్వతీదేవి, పంచముఖి గాయత్రీ మాత ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రుల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవార్లు బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణ అనంతరం అమ్మవార్లకు ఆలయ పూజరాలు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు.

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

మద్దికెర : పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో రాజేశ్వరిదేవిని బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగనాథ, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు. అలాగే స్థానిక మద్దమాంబ దేవాలయం, చౌడేశ్వరి, నగరేశ్వర దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వెల్దుర్తిలో గురువారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని మొదటి రోజు కన్యకాపరమేశ్వరి రూపంలో, అలాగే 44 జాతీయ రహదారిపై వెలసిన భువన గాయత్రీ దేవాలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. ఆయా ఆలయాల్లో ఉదయం అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భువన గాయత్రీ పీఠాధిపతి బాలకృష్ణస్వామి, ట్రస్ట్ సభ్యులు జూలకంటి రఘునాథ్‌రెడ్డి, లక్ష్మి సరోజ, జగదీష్, రమణాచారి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీరాములు పాల్గొన్నారు.

ఆలూరు : స్థానిక వాసవీమాత దేవాలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవిని ఆలయ అర్చకులు నరేంద్ర శాస్త్రి అర్ధనారీశ్వరిగా అలంకరించారు.


బాలాత్రిపుర సుందరిగా భువన గాయత్రీ దేవి


బాలా త్రిపుర సుందరిగా సుంకులా పరమేశ్వరి


అర్ధనారీశ్వర అలంకరణలో వాసవీ మాత


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

ఉదయం వాసవీ మాతకు గంగ పూజ, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలను చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. జనార్దన్ శెట్టి, భాస్కరయ్య, నాగేంద్రయ్య శెట్టి, సుబ్రహ్మణ్యం, వేణు పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక సుంకులా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు మొదటిరోజు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు.

ఆస్తుల విధ్వంసాలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు: ప్రభుత్వ ఆస్తులను విధ్వంసాలకు పాల్పడితే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని మొలగవెల్లి, ఆస్పరి మండలం జొహరాపురం, దేవనకొండ మండలం జిల్లెలబుడకల గ్రామాల్లోని విండ్ పవర్ ప్లాంట్ కార్యాలయాల వద్దకు వివిధ మండలాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు గురువారం వెళ్లి తమ వర్గానికి సంబంధించిన వారిని కార్మికులుగా పనిలో ఉంచుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు టీడీపీ వర్గానికి చెందిన వారినే పనిలో ఉంచుకోవడంపై ఆగ్రహించిన కార్యకర్తలు, నాయకులు కార్యాలయంలోని ఫర్నీచర్, కంప్యూటర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామం వద్ద బుసినేని వెంకటేశ్వర్లుతో పాటు 23 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. అలాగే.. గుమ్మనూరు గ్రామానికి చెందిన నారాయణతో పాటు మరికొందరు మొలగవెల్లి విండ్ పవర్ దగ్గరికి వెళ్లి మాట్లాడటం కూడా చట్టపరంగా నేరమేనని, నారాయణతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆలూరు,దేవనకొండ, ఆస్పరి, పత్తికొండ, వెల్దుర్తి సీఐలు శ్రీనివాసనాయక్, వంశీనాథ్, మస్తాన్ వలి, జయన్న, మధుసూదన్‌రావు, ఎస్ఐలు నరసింహులు, బాల నరసింహులు పాల్గొన్నారు.

దేవనకొండలో డెంగీ కేసు నమోదు


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

దేవనకొండ: మండల కేంద్రంలో నాలుగేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయ్యిందనే సమాచారం మేరకు వైద్యాధికారి కల్యాణ్ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బాలుడి ఇంటిని సందర్శించి చుట్టుపక్కల, బాలుడి ఇంట్లో, పరిసరాల్లో దోమల నియంత్రణకు అబెట్,పైరిత్రియం ద్రావ ణం పిచికారీ చేయించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సీహెచ్ఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర జయలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్


ఇళ్లలో సోదాలు చేస్తున్న ఆలూరు సీఐ, ఎస్ఐ


గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

హొళగుంద: ఈ నెల 12వ తేదీన దేవరగట్టులో జరిగే దసరా బన్ని ఉత్సవాల్లో రింగు కర్రలను వాడకుండా ఉండేందుకు గురువారం ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, ఇతర మండలాల ఎస్ఐలు, సిబ్బంది కొత్తపేట గ్రామంలో కార్డెర్ సెర్చ్ నిర్వహించారు. రింగు కర్రలు, నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో బన్ని ఉత్సవంలో రింగుకర్రలు వాడడం, సారా సేవించి ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. విగ్రహాల ఊరేగింపులో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నెరణికి తండా, కొత్తపేట కొండల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊట ధ్వంసం చేశారు.